


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

121

(7 ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఇటీవల** హైదరాబాదు వెళ్ళినప్పుడు ఒక యువకుడు కనిపించి తనకు ఉద్యోగం కావాలని, కొంచెం ప్రయత్నిస్తే ఎంతో సంతోషిస్తాననీ, జన్మలో మరిచిపోనని, ఏవేవో చెప్పాడు. అతడి స్థితికి జాలి కలిగింది. అందువల్ల అతని బదులుగా నేను వెళ్ళి కొందర్ని ఆశ్రయించవలసి వచ్చింది. చివరకు ఒక పెద్దమనిషి ఉద్యోగం ఇస్తానని వాగ్దానం చేశాడు. అభ్యర్థిని పంపమన్నాడు. నేనెంతో సంతోషించి ఆ కుర్రవాణ్ణి కలుసుకుని శుభవార్త చెవిని వేశాను. ఫలానారోజు వెడతానన్నాడు. "అమ్మయ్య ఒక హృదయానికి రవంత శాంతి దొరికింది కదా" అని సంతోషించాను.

నేను తిరిగి వచ్చిన తర్వాత రెండు మూడు ఉత్తరాలు వ్రాశాను. వెళ్ళి ఉద్యోగంలో చేరావా? అని. అతడు ఇంకా జేరలేదని, పై అధికారిని కలుసుకోవడం ఇంతవరకు పడలేదని వ్రాశాడు. అంత ఆదుర్దాపడ్డవాడు ఇంత బేపర్వాగా వున్నాడేంటో అనుకున్నాను.' ఇలా ఆలోచిస్తుండగా మొన్న ఒక రోజున విజయవాడ వచ్చి మా యింటికి వచ్చాడు. ఆ రావడంలో ఎంతో సంతోషంగా వచ్చాడు. ఉద్యోగంలో చేరి 'థాంక్స్' చెప్పడానికి ఇంతదూరం వచ్చాడు కాబోలనుకుని "ఎందుకయ్యా ఇంత శ్రమ తీసుకున్నావు?" అన్నాను.

"శ్రమేమీలేదండీ. చిన్నకారులో వచ్చాను. ఎరుగున్న పెద్ద మనిషి వస్తూ నన్ను కూడా రమ్మన్నాడు. పోనీ వెళ్ళి వద్దాం అని వచ్చేశాను. వచ్చాను కదా అని మిమ్మల్ని చూడటానికి వచ్చాను" అన్నాడు ఎంతో కులుకుతూ.

"అయితే ఉద్యోగంలో చేరే వచ్చావా?" అన్నాను.

"అబ్బే లేదండీ. ఇంకా నేనా అధికారిని కలుసుకోనేలేదు" అని. ఒకనాడు ప్రత్యక్షదైవం అన్నవాడే ఒక నిర్లక్ష్యపు చూపు పారేశాడు తేలిగ్గా.

"అదేమిటి? ఇంత ఆలస్యం చేసావు. ఏమనుకుంటాడో" అన్నాను.

"ఫర్వాలేదండి. ఆ ఉద్యోగం కాకపోతే మరొకటి. ఇప్పుడింత తొందరేంటి బోలెడు ఉద్యోగాలున్నాయి చెయ్యాలేగాని. నన్ను కారులో తీసుకొచ్చిన పెద్ద మనిషి ఉద్యోగం కావాలంటే పదినిముషాల్లో ఇప్పిస్తాను. అయినా అంత తొందరేమిటి? కొన్నాళ్ళు కులాసాగా తిరుగు అన్నాడు తెలుసా?" ఉద్యోగం ప్రత్యక్ష దైవం అన్నవాడే ఒక నిర్లక్ష్యపు చూపు పారేశాడు.

నేనేం మాట్లాడాలో తెలియలేదు. గొంతులో వెలక్కాయ పడ్డట్లయింది. కొంచెం తెప్పరిల్లి "ఆ రోజున హైదరాబాదులో ఉద్యోగం కోసం అంత అర్థించావు. ఇంట్లో ఇబ్బందిగా వున్నదన్నావు. మరి ఇలా మాట్లాడుతున్నావేం ఇవ్వాళ?" అన్నాను.

"అది నెలరోజుల క్రిందటిమాట కాదటండీ. అప్పడు మూడ్ అలా వుంది ఇవ్వాళలా లేదు. మనస్సు ఎంతో హాపీగా వుంది. అంరేం ఫర్వాలేదు నీ జీవితానికని ఆకాశవాణి హెచ్చరిస్తున్నట్లుంటుంది. మిమ్మల్ని హైదరాబాదులో కలుసుకున్న రోజూ మనస్సు

పిచ్చిపిచ్చిగా వుంది. సమయానికి మీరు కనిపించారు. బాధంతా అలా వెళ్ళగక్కాను. ఇది ఒకే పద్ధతిగా జీవితాన్ని గురించి లెక్కకట్టుకునే కాలం కాదు. వెయ్యి కెరటాలు, వెయ్యి లొట్టలు - ఏమంటారు?" అన్నాడు.

"ఏమంటాను? నన్ను వృథాగా శ్రమ పెట్టావంటాను" అన్నాను.

"అలా అనుకోకండి. మీ డ్యూటీ మీరు చేశారు. పెద్దలేమన్నారు? "జీవితం ఒక డ్యూటీ అది నెరవేర్చు" అని కాదు. మీరారోజు డ్యూటీ తప్పితే మీ గొప్పతనం ఏంవుంటుంది? అసలు అలా జరిగితే మిమ్మల్ని ఇవ్వాళ చూడటానికి ఎందుకొస్తాను? వెళ్ళి వస్తాను. నాతో వచ్చిన పెద్దమనిషి ఎదురు చూస్తూ వుంటాడు" అంటూ అతగాడు లేచి పోయాడు.

ఆ రోజు హైదరాబాదులో సంసారం చెయ్యలేక అస్త్ర సన్యాసం చేసేవాడిలాగా కనిపించిన యువకుడు ఈనాడు గీతాచార్యుడుగా నాకు ప్రత్యక్షమయ్యాడు. ఏమిటి ఈ విపరీతం అనుకుంటూ కూర్చున్నాను.

విపరీతమేమిటి? కాలం అలా నడుస్తోందనుకోవాలి గాని. ఇదివరకటి రోజుల్లో బంధుత్వాలు, స్నేహాలు, కృతజ్ఞతలు, వగైరాలు జీవితాంతల వరకూ వుండేవి. ఎవరైనా వచ్చి "ఫలానావాడు మారిపోయాడు. మిమ్మల్ని నిందించాడు నడిబజారులో నిలబడి" అని చెపితే

"మీరు సరిగా వినివుండరు. ఎవర్ని నిందించాడో. నన్ను నిందించడంలాటి పని అతడెప్పుడూ చెయ్యడు. అతడి సంగతి నాకు తెలుసు" అని గట్టిగా వాదించేవారు. ఇప్పుడలాంటి విశ్వాసాలెక్కడున్నాయి. ఈ కాలంలో ఏ రోజు వ్యవహారం ఆ రోజే. ఏరోజు మర్యాదా ఆ రోజే. మర్నాటి పోజులో మనం అతణ్ణి గుర్తుకూడా పట్టలేం. పట్టినా కొంచెం నిలబడి పలకరించడు. అక్కడితో ఇద్దరికీ రామ్ రాం అనుకోవడం తటస్థిస్తుంది.

ఎవరైనా పలకరించినా, తాత్కాలిక ప్రతిపాదనలు, తాత్కాలిక రస ప్రదర్శనలు, తాత్కాలిక ప్రయోజనాన్వేషణలు కాక జీవితంలో వారు కోరే శాశ్వతత్వం ఏమిటి? అని ఆలోచిస్తే చివరకు మిగిలే అప్రతిష్ఠేమోననిపిస్తుంది.

"నిన్న కలిసి నేటితోను, నేడు కలియక రేపటిలో" అన్న భావన ఈనాడు వ్యంగ్యమైందనిపిస్తుంది.

మొన్న ఒకామె ఈ క్రింది కథ చెపుతుంటే విన్నాను. వారు మరో ఊరులో వుండగా, ప్రక్క ఇంట్లో ఒక సామాన్య కుటుంబీకుడుండేవాడట. రోజూ తిండికి కూడా ఇబ్బంది పడుతూ వుండేవాడట. ఈవిడ యింటికి అప్పుసొప్పులకు వస్తూవుండేవాడట. ఒకప్పుడు ఇంట్లో ఏదైనా చేసుకుంటే జాలిపడి ఈవిడే తీసుకు వెళ్ళి పెట్టి వుండేదిట. ఆ ఇల్లాలు ఎంతో పొగిడేదట.

కొంతకాలానికి వీరికి బదిలి అయి వచ్చేశారట. తర్వాత పక్కయింటావిడ హఠాత్తుగా ఒక పెళ్ళిలో కనిపించిందంట. ఆవిడ ఎంతో ఆప్యాయంగా దగ్గరికి వెళ్ళి "ఏమండీ మీనాక్షమ్మగారూ పెళ్ళికి వచ్చారా పిల్లలేరి? అంతా కులాసాగా వున్నారా?" అని అడిగిందట.

ఆవిడ ఈవిణ్ణి బొత్తిగా ఎరగనట్లు ఎగాదిగా చూచి, "అవును మా తమ్ముడి పెళ్ళి విడిదిలో వున్నారు. మీరెవరో గుర్తు రావడంలేదు" అందిట. ఈవిడ గుండె మీద తేలు కుట్టినంతపని అయి, కాసేపటిదాకా తెప్పరిల్లలేక పదహారు నెలలు ప్రక్క ప్రక్కన వున్నవాళ్ళంమేమే జ్ఞాపకం లేమా తల్లీ? తమ్ముడు పెళ్ళిగదా పదహారు రోజుల పండుగదాకా. ఆడబడుచు రెక్కలుంటాయి గనుక అలా విసురుకొంటోంది. గావన్ను అనుకుని "అసలు మీ పేరు మీనాక్షమ్మగారేనా?" అందిట.

"ఇంకేం పేరు మీనాక్షమ్మే. ఇందాకటినుంచి పందిట్లో అందరూ పిలవడంలా. పేరు తెలిసినంత మాత్రంతో ఎరిక ఏర్పడుతుందేమిటి?" అని రుంజుకుంటూ పందిరి గుంజలచుట్టూ వాన వల్లప్పలు తిరుగుతూ పక్కపక్కగా పోయిందట. "మరుపు మహద్భాగ్య"మన్న సామెత ఆవిడకు నచ్చిందేమో.

సంక్రాంతి పండగముందు మాకో ఉత్తరం వచ్చింది బంధువుల దగ్గరనుంచి. "మేము బెజవాడ మీదుగా మావూరు వెడుతున్నాం. అక్కడ నాలుగురోజులున్న తర్వాత ఫలానా తారీకున మీ ఊరు వస్తాం. మీరు ఊర్లోనే వుంటారు కదా? ఉత్తరం వ్రాయండి" అని ఆ రోజే కార్డు వ్రాసివేశాం.

వస్తానన్న రోజు ఎదురు చూశాం. తర్వాత ప్రతిరోజూ ఎదురు చూశాం. వాళ్ళు రాలేదు సరికదా. ఉత్తరం కూడా రాలేదు. తిరిగి హైదరాబాద్ మీదుగా స్వస్తానానికి చేరుకున్నట్లు తెలిసింది.

తర్వాత ఎవరో ఆ ఊరు వెడుతుంటే "వాళ్ళు ఎందుకు రాలేదో కొంచెం కనుక్కురండి" అని చెప్పాం. ఆయన వెళ్ళి అడిగితే ఇలా చెప్పారట.

"మేము ఊరు బయలుదేరేముందు ఎన్నో ఊహలొచ్చాయి. వాళ్ళ యింటికి వెడదామనేది అందులో ఒకటి. మా ఊరు చేరిన తర్వాత విశ్రాంతిగా ఆలోచిస్తే ఎన్నో ఊహలొచ్చాయి. వదిలి వచ్చిన ఊర్లో వాళ్ళనెందర్నో చూడాలని కొన్ని ఊహలొచ్చాయి. అవి పాత వూహల కన్నా బలమైనవి. అందుకని వచ్చేశాం. నేరమేం వుంది. ఏ ఒక్క వూహలోనూ ఉట్టికట్టుకుని కూర్చోలేంగదా" అన్నారట.

ఊహలు వాటిని బట్టి వ్యక్తులు మారిపోతున్నారు. ఏరోజుకారోజు. ఏ పోజుకాపోజు.

Post your comments